నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ గురువారం 30 జనవరి 2025 | ADILABAD NIRMAL


# సమస్యలను పరిష్కరించండి..



ఇస్పూర్ గ్రామస్తుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జనవరి 29 : ఇస్పూర్ గోండుగూడ గ్రామంలో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు గ్రామస్తులు విన్నవించారు. బుధవారం ఆయన నివాసంలో గ్రామ పెద్దలు, మహిళలు వచ్చి కలిశారు. ముఖ్యంగా గ్రామంలో విద్యుత్ సమస్యతో గోస పడుతున్నామని ఎమ్మెల్యేకు చెప్పారు. దీంతో వెంటనే విద్యుత్ శాఖ ఏఈ నాగేంద్ర ప్రసాద్ సిబ్బందిని పిలిపించి గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వారి ముందే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పడంతో గ్రామస్తులు సంతోషించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తాను. ఎలాంటి సమస్య ఉన్న తనకు చెప్పాలని గ్రామస్తులతో అన్నారు.

## ఉమ్మడి జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు

| నియోజకవర్గం | ఓటర్లు |
|---|---|
| ఆదిలాబాద్ | 7,961 |
| బోథ్ | 4,576 |
| నిర్మల్ | 9,568 |
| ఖానాపూర్ | 5,412 |
| ముథోల్ | 4,835 |
| మంచిర్యాల | 16,542 |
| చెన్నూర్ | 7,308 |
| బెల్లంపల్లి | 5,144 |
| ఆసిఫాబాద్ | 2,739 |
| సిర్పూర్ | 3,653 |
| మొత్తం | 67,738 |

## ఉపాధ్యాయ ఓటర్లు

| జిల్లా | పురుషులు | స్త్రీలు |
|---|---|---|
| ఆసిఫాబాద్ | 314 | 143 |
| మంచిర్యాల | 940 | 610 |
| ఆదిలాబాద్ | 1,073 | 488 |
| నిర్మల్ | 1,263 | 681 |

## పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు

| జిల్లా | సెంటర్స్ |
|---|---|
| ఆదిలాబాద్ | 22 |
| నిర్మల్ | 32 |
| ఆసిఫాబాద్ | 18 |
| మంచిర్యాల | 38 |

# అవార్డులు పార్టీలకు సంబంధించినవి కావు

- మాజీ మంత్రి జోగు రామన్న
- కేంద్రసహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

ఎదులాపురం, జనవరి 29 : అవార్డులు అనేవి పార్టీలకు సంబంధించినవి కావని, వారి గౌరవానికి, సృజనాత్మకతకు గుర్తింపుగా ఇచ్చేవని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్దర్‌కు ప్రకటించిన పద్మభూషణ్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. సంజయ్ మాటలు, స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాటల మధ్య వ్యత్యాసంతో బీజేపీలో విభేదాలు బయట పడుతున్నాయన్నారు. కాంగ్రెస్-బీజేపీల ద్వంద్వ వైఖరితో గద్దర్ వంటి మహోన్నతమైన వ్యక్తి ప్రతిష్టతకు భంగం కలిగించొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు నారాయణ, ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న




## పోలింగ్ సమయం

(ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు)






# కాంట్రాక్టు ఉద్యోగుల బైక్ ర్యాలీ

ముథోల్, జనవరి 29 : బాసర ట్రిపుల్ ఐటీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఇటీవల అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ త్వరలోనే తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఆధ్యాపక నియామకాలు చేపడుతామని అన్నారు. ఎన్నో ఏండ్లుగా విశ్వవిద్యాలయాల అభ్యున్నతికి కృషి చేస్తున్నటు వంటి మా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ గురించి ప్రస్తావన రాకపోవడం విచారమని అన్నారు. ఈ కార్యక్రమంలో 77 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీ నిర్వహించిన బైక్‌ర్యాలీలో పాల్గొన్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

# 'ఉపాధి' ఉద్యోగుల నిరసన

ఎదులాపురం, జనవరి 29 : ఉపాధి ఉద్యోగులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పే స్కేల్‌ను అమలు చేయాలని జేఏసీ సభ్యుడు జగదేరావ్ డిమాండ్ చేశాడు. ఉపాధి హామీ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా నిరసన తెలిపారు. ఇందులో భాగంగా డీఆర్డీఏ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ కన్సల్టెంట్ నరేందర్, టీఏ మహేశ్, గంగయ్య, గణేశ్, కంప్యూటర్ అసిస్టెంట్ సతీశ్, అర్జున్, సొనాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.



డీఆర్డీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జేఏసీ సభ్యులు

# పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- ముగియనున్న టి.జీవన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి పదవీకాలం
- అమలులోకి వచ్చిన కోడ్.. కొత్త పథకాల అమలుపై నీలినీడలు

మంచిర్యాల, జనవరి 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ స్థానంతోపాటు మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ స్థానానికి, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఎన్నికల సంఘం ప్రకటనతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఏక కాలంలో ఒకే సమయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి టి.జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘోత్తంరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరు ఇరువురి పదవీకాలం మార్చి 29వ తేదీన ముగియనుంది. భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్‌ను అనుసరించి ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుంది. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలుకానున్నది. నామినేషన్లకు ఎనిమిది రోజుల సమయం ఇచ్చారు. ఫిబ్రవరి 10 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కాగా, ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ఉండనుంది. నామినేషన్ల గడువు ముగిశాక 12 రోజులపాటు ప్రచారం నిర్వహించుకోడానికి అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అనంతరం ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తారు. మార్చి 8 నాటికి ఎన్నికల కోడ్ ముగియడంతోపాటుగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ పూర్తికానున్నది. కాగా.. గతంతో పోలిస్తే పట్టభద్రుల ఓటర్ల సంఖ్య పెరిగింది. మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో 2.50 లక్షల మంది వరకు పట్టభద్రుల ఓటర్లు ఉండే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల మద్దతు కోసం పలు సంఘాల నాయకులు ప్రయత్నిస్తున్నారు. వివిధ విద్యా సంస్థల యజమానులు, వివిధ రంగాల్లో ప్రజలకు సేవలు అందించిన వారంతా పోటీలో నిలబడేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ మేరకు ప్రచారాలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో స్పీడ్ పెంచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

### పథకాల అమలుపై నీలినీడలు

ఎమ్మెల్సీ షెడ్యూల్ విడుదలతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలతోపాటుగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగడానికి అవకాశం లేదు. దీంతో ఈనెల 26వ తేదీన ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల అమలుపైనా నీలినీడలు కమ్ముకున్నాయి. మార్చి 31వ తేదీ నాటికి రైతులందరికీ రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. కానీ.. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. దీంతో ఈ జిల్లాలో ఆ సమయానికి పథకం అమలును పూర్తి చేయడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల కోడ్ దృష్ట్యా మిగిలిన పథకాల అమలుకు ఎన్నికల సంఘం ఆమోదించే అవకాశాలు తక్కువే. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుబంధు పథకాన్ని అమలు చేయడానికి వీల్లేదని ఎన్నికల సంఘం చెప్పింది. దీంతో ఇటీవల ప్రకటించిన పథకాల అమలు సాధ్యం అయ్యేలా లేదు. ఎమ్మెల్సీ ఎన్నికలు అయ్యాక స్థానిక సంస్థల ఎన్నికలు రావచ్చు. దీంతో ప్రభుత్వ పథకాల అమలు ఇప్పట్లో ఉండదనే ప్రచారం జరుగుతున్నది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలిసే ప్రభుత్వం పథకాలను మొదలు పెట్టిందని, ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా ఇవ్వలేకపోయామని సాకులు చెప్పి, ఆ తర్వాత చేతులు ఎత్తేసే అవకాశమే ఎక్కువ ఉందని రాజకీయ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

# నాగోబాకు పోటెత్తిన జనం



నాగోబా ఆలయ ఆవరణలో ముఖంపై తెల్లటి వస్త్రాలను కప్పుకున్న కొత్త కోడళ్లు, చిత్రంలో గిరిజన మహిళలు

ఇంద్రవెల్లి, జనవరి 29 ః మెస్రం వంశీయులు మంగళవారం అర్ధరాత్రి నిర్వహించిన మహాపూజతో నాగోబా జాతర ప్రారంభమైంది. బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. గంటల తరబడి బారులుదీరి నాగోబాను దర్శించుకున్నారు. మహాపూజ అనంతరం 52 జతల (104 మంది) కొత్తకోడళ్లకు నాగోబా సన్నిధిలో పరిచయ (బేటింగ్) కార్యక్రమాన్ని మెస్రం వంశీయులు పెద్దల సమక్షంలో నిర్వహించారు. అనంతరం కొత్త కోడళ్లకు నాగోబాను దర్శించుకునే అవకాశం కల్పించారు. సతిక్ దేవత, నాగోబాను దర్శించుకున్న కొత్తకోడళ్లు మెస్రం వంశీయుల పెద్దల ఆశీస్సులు తీసుకుని, మెస్రం వంశీయుల కోడళ్లుగా మారారు. తర్వాత సంప్రదాయబద్ధంగా గోవాడ్‌లో ప్రవేశం కల్పించారు.

### అవ్వాల్ దేతకు పూజలు

మహిళలతోపాటు కొత్తకోడళ్ల ఆధ్వర్యంలో 22 కితలవారీగా అవ్వాల్ దేవతకు సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి అవ్వాల్ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉపవాస దీక్షలను విరమించి సామూహిక భోజనాలు చేశారు. గోవాడ్‌లో కొత్త కోడళ్లు, మహిళలు దీపాలు వెలిగించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, ఉట్నూర్ సీఐ మొగిలి, ఇంద్రవెల్లి ఎస్ఐ సునీల్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్రారంభంకాని క్రాప్ బుకింగ్

- చేతికొచ్చిన పంటలు.. కొనుగోళ్లలో జాప్యం
- రైతుల్లో ఆందోళన

ఆదిలాబాద్, జనవరి 29(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో యాసంగి పంట కొనుగోళ్ల విషయంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరలతో రైతులు నష్టపోకుండా మార్కెట్ యార్డుల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. వానకాలంలో సాగు చేసిన సోయాబిన్ పంటను మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించగా, సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. యాసంగిలో 1.60 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో జొన్న 70,520 ఎకరాలు, శనగ 68,500.. మొక్కజొన్న 18,220.. గోధుమ 4,650 ఎకరాల్లో వేయనున్నట్లు అధికారులు తెలిపారు. యాసంగిలో సాగు చేసిన శనగ పంట చేతికి వచ్చింది. జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులు పంటను కోసి కుప్పలు వేశారు. కొన్ని రోజుల్లో మిగతా పంటలు కోతకు రానున్నాయి.

### క్రాప్ బుకింగ్ కాక రైతుల ఆందోళన

రైతులు సాగు చేసిన పంటలను కొనుగోలు చేసి వారికి మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా క్రాప్ బుకింగ్ విధానం అమలు చేస్తుంది. ప్రతి సీజన్‌లో రైతులు తమకున్న వ్యవసాయ భూమిలో ఎన్ని ఎకరాల పంటలు వేశారనే వివరాలను సేకరిస్తారు. జిల్లాలోని 102 వ్యవసాయ క్లస్టర్లు ఉండగా మండల వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఈ వివరాలను రైతులవారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వ్యవసాయ శాఖ అధికారులు సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో మార్కెటింగ్‌శాఖ అధికారులకు చేరుతాయి. వీటి ఆధారంగా మార్కెట్ యార్డుల్లో పంటలను కొనుగోలు చేస్తారు. ఈ విధానం వల్ల దళారులు తమ పంటలను ప్రభుత్వం కేంద్రాల్లో విక్రయించే అవకాశాలు ఉండవు. పంటల కొనుగోళ్లకు రెండు నెలల ముందుగానే ఈ ప్రక్రియ జరగాల్సి ఉండగా.. ఇప్పటి వరకు జిల్లాలో క్రాప్ బుకింగ్ కాలేదు.



బోథ్ మండలంలోని కనుగుట్టలో కోసి కుప్పలు వేసిన శనగ పంట

దీంతో రైతుల్లో ఆందోళన నెలకుంది. ఈసారి మద్దతు ధరతో తమ పంటలను కొనుగోలు చేస్తారా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### డిజిటల్ విధానంలో నమోదు

ఆదిలాబాద్ జిల్లాలో యాసంగి పంటలకు సంబంధించిన క్రాప్ బుకింగ్ ఇంకా ప్రారంభం కాలేదు. ఈ సీజన్‌లో డిజిటల్ విధానంలో క్రాప్ బుకింగ్ చేయాలని ఆదేశాలు ఉన్నాయి. రెండు, మూడు రోజుల్లో ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. పంటల కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

*- శ్రీధర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఆదిలాబాద్.*




మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నిర్మల్ అర్బన్, జనవరి 29 : ప్రజలు రోడ్డు భద్రత నియమాలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి శివాజీ చౌక్ వరకు వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్మల్‌ను రోడ్డు ప్రమాదరహిత జిల్లాగా మార్చాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 26 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించామని, వీటిని ప్రమాదరహిత ప్రదేశాలుగా మార్చినట్లు తెలిపారు. అనంతరం వాహనదారులకు హెల్మెట్‌లను అందించి ర్యాలీని ప్రారంభించారు. ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీలు రాజేశ్ మీనా, ఉపేందర్ రెడ్డి, డీటీవో దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ, తహసీల్దార్ రాజు, డీవైఎస్ఎవో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

# దరఖాస్తులను స్వీకరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జనవరి 29 : ప్రజావాణి కార్యక్రమాన్ని రోజూ మండల స్థాయిలో నిర్వహించి అర్జిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం అదిలాబాద్ రూరల్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల ప్రజావాణి ఫెసిలిటీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల స్టేటస్‌ను తెలియజేయాలని సూచించారు.